క్లుప్తంగా...

అక్రమంగా గేటు కూల్చారు

తహసీల్దార్‌కు స్కౌట్స్ అధికారుల ఫిర్యాదు



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఫైర్ స్టేషన్ అధికారులు అక్రమంగా భారత్ స్కౌట్స్‌కు చెందిన ప్రధాన గేటును కూల్చివేశారని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని స్కౌట్స్ అధికారులు సికింద్రాబాద్ తహసీల్దార్ శైలజకు ఫిర్యాదు చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి కొనసాగుతున్న తమ స్థలంలో అక్రమంగా ప్రవేశించిన అగ్నిమాపక అధికారులు అధికారాన్ని ఉపయోగించుకుని ప్రధాన గేటును కూల్చివేసి కబ్జా చేసేందుకు యత్నించారన్నారు. దీనిపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు స్కౌట్స్ అధికారులు పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో డాక్టర్ ఎంహెచ్ భతేన, విజయభాస్కర్, రాజశేఖర్‌రెడ్డి, గౌరినాథ్, విష్ణుప్రసాద్, వనం రాజు, నాగేంద్ర ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలో పాల్గొన్న హేమ

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలోని సాయినాథుని ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఆలయ చైర్మన్ మింగు వెంకట సాయికుమార్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సామల హేమ, కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ముఖ్య అతిథులుగా హాజరై పూజలు నిర్వహించారు. పూజలో ఆలయ చైర్మన్ వెంకట సాయికుమార్, భక్తులు గడ్డం అశోక్, శివ, దత్తు, గౌడ్‌శ్రీను పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడాలి



చిలకలగూడ: చిలకలగూడ గాంధీచౌక్ వద్ద సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ నేతృత్వంలో జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వ మతోన్మాద రాజకీయాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామని, సంఘటితంగా పోరాడితే కార్మిక చట్టాలను సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. మధు, నర్సింగరావు, ఎల్లస్వామి, పరుశురామ్, మల్లేష్, సుధాకర్, రమేష్, జగన్, వెంకన్న, శ్రీను, రాజ్ పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సీఐ మట్టంరాజుకు జ్ఞాపిక అందిస్తున్న భువన్‌రావు

చిలకలగూడ: సైబర్ నేరాలపై మరింత అప్రమత్తంగా ఉండాలని చిలకలగూడ సీఐ మట్టంరాజు సూచించారు. ఠాణా పరిధిలో సైబర్ నేరాలకు సంబంధించి ఫిర్యాదులు తరుచూ నమోదు అవుతున్నాయని, కాలనీలు, అపార్ట్‌మెంట్లు, స్కూల్స్, కాలేజీలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, తదితర ప్రాంతాల వద్ద సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుర్తు తెలియని వారికి వివరాలు చెప్పరాదన్నారు. చిలకలగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన మట్టంరాజును సవరాలబస్తీకి చెందిన టీఆర్ఎస్ నాయకుడు పొగర్తి భువన్‌రావు శాలువా కప్పి సన్మానించారు.

వికలాంగుల బంధు ప్రవేశపెట్టాలి



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

లాలాపేట: దళిత బంధు తరహా వికలాంగుల బంధు పథకాన్ని ప్రవేశపెట్టి అమలు చేసి వికలాంగుల పింఛన్ రూ.10 వేలకు పెంచాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షులు కొల్లి నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వారు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 12 లక్షల మంది వికలాంగులు ఉంటే కేవలం 5 లక్షల 80 వేల మందికే పింఛన్ వస్తుందన్నారు. వికలాంగులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం 2016ని పటిష్టంగా అమలు చేయాలని వినతిలో కోరారు. మంత్రిని కలిసిన వారిలో శివరాత్రి రాజయ్య, శ్రీనివాస్, సంజయ్ ఉన్నారు.

కొలువుల కార్ఖానా.. సనత్‌నగర్ ఐటీఐ

- మల్టీనేషనల్ కంపెనీల కొలువులకు కేరాఫ్‌గా..
- ఐటీఐ కోర్సులకు పెరిగిన డిమాండ్ ఒక్కో సీటుకు పదుల్లో పోటీ
- మల్టీనేషనల్ కంపెనీలతో ఎంఓయూ శిక్షణ.. ఆపై ఉపాధి



వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సనత్‌నగర్: టాటా ప్రాజెక్ట్స్.. హ్యుందాయ్ మోటార్స్..టయోటా కిర్లోస్కర్.. ఇలా ఒక్కో మల్టీనేషనల్ కంపెనీ అక్కడి విద్యార్థులకు స్వాగతం పలుకుతాయి. అంత పెద్ద పెద్ద కంపెనీల్లో కొలువులు అందిపుచ్చుకుంటున్న ఆ విద్యార్థులు కార్పొరేట్ కళాశాలల్లో చదివారా అనుకుంటే పొరపాటే. వారంతా సామాన్య విద్యార్థులే. అందులోనూ ప్రభుత్వ సంస్థలో విద్యనభ్యసిస్తున్న వారే. అయితే ఆయా కంపెనీలు చేసేదల్లా ఒక్కటే ఎంఓయూ (మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్) కుదుర్చుకుని తమకు తగినట్లుగా ప్రతిభను మౌల్డ్ చేసుకుంటూ కొలువులకు వేదికవుతున్నాయి. ఇంతకీ మల్టీనేషనల్ కంపెనీలు క్యూ కడుతున్న సంస్థ ఏదంటారా అదే సనత్‌నగర్‌లోని ప్రభుత్వ ఐటీఐ.

కెరీర్‌ను మలుపుతిప్పేలా..

దేశాభివృద్ధిలో కీలకమైన పారిశ్రామిక రంగం వైపు అడుగిడుతోన్న నవ యువకుల ప్రతిభకు సనత్‌నగర్ ఐటీఐ పదును పెడుతోంది. మారుతున్న కాలమాన పరిస్థితులు, డిమాండ్‌కు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెడుతూ పారిశ్రామిక రంగంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దుతోంది. విద్యాభ్యాసం కొనసాగుతుండగానే విద్యార్థి లోకం ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకునే దిశగా విద్యాబోధన చేస్తోంది. ప్రాక్టికల్స్ చేసేందుకు పలు పారిశ్రామిక సంస్థలు ఇక్కడి విద్యార్థులను ఆహ్వానిస్తూ వారి కెరీర్‌ను మలుపు తిప్పుతూనే ఉన్నాయి.

ఐటీఐ అందిస్తున్న కోర్సులు ఇవే..

కోపా (రెండేళ్ల కాల పరిమితి), డ్రాఫ్ట్‌మెన్ సివిల్ (రెండేళ్లు), ఎలక్ట్రీషియన్ (రెండేళ్లు), ఎలక్ట్రానిక్ మెకానిక్ (రెండేళ్లు), ఫిట్టర్ (ఏడాది), పెయింటర్ (ఏడాది), రిఫ్రిజిరేటర్ అండ్ ఎయిర్ కండిషన్ (రెండేళ్లు), మెకానిక్ మోటార్ వెహికల్ (రెండేళ్లు), వెల్డర్ (ఏడాది). ఆయా కోర్సులను కలుపుకుని ఇక్కడ 360 సీట్లు అందుబాటులో ఉండగా పోటీ మాత్రం వేలల్లో ఉండడం గమనార్హం.

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలకు దీటుగా..

బీటెక్, ఎంటెక్ విద్యనభ్యసించి ఉద్యోగాల కోసం వెతుకులాడే వారు కోకొల్లలు. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ రంగాలకు దీటుగా ఐటీఐకు ఆదరణ పెరుగుతోంది. సనత్‌నగర్‌లోని ఐటీఐ సంస్థలో



చేరేందుకు వెల్లువెత్తుతున్న దరఖాస్తులే ఇందుకు నిదర్శనం. గత ఐదేళ్ల కిందట సీట్ల భర్తీ కోసం వేచి ఉండే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఒక్కో సీటుకు పదుల సంఖ్యలో పోటీ పడ్డారంటే ఐటీఐ విద్యకు పెరుగుతున్న ఆదరణ ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

పారిశ్రామికవాడ సాక్షిగా ..

1982లో నాటికి పారిశ్రామిక ఉత్పత్తుల తయారీలో సనత్‌నగర్ ముందంజలో ఉంది. ఆల్విన్, ఓల్టాస్ వంటి బడా పరిశ్రమలు తమ ఉత్పత్తులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎగుమతి చేసేవి. ఆ సమయంలో నిపుణుల కొరత ఆయా పరిశ్రమల యాజమాన్యాలను వేధించేది. ఈ క్రమంలో యువతకు ప్రత్యేకంగా శిక్షణనిచ్చి నేరుగా తమ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే ఆలోచనను పరిశ్రమల యాజమాన్యాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ప్రభుత్వం సనత్‌నగర్ జెక్‌కాలనీ రహదారిలో అప్పటి ఆల్విన్ కంపెనీ ఎదురుగా ఐటీఐను నెలకొల్పింది. అప్పటి నుంచి పరిశ్రమల అవసరాల మేరకు విద్యార్థులకు నైపుణ్యాన్ని పెంపొందిస్తున్నారు.

విద్యార్థి దశలోనే ఉద్యోగం..

పదో తరగతిలో చూపిన ప్రతిభ ఆధారంగా ఐటీఐ సీట్ల భర్తీ జరుగుతుంది. రెండేళ్ల కోర్సు పూర్తవుతుండగానే కంపెనీలు ఇక్కడి వారిని నియమించుకునేందుకు వరుస కడుతుంటాయి. అప్రెంటీస్, ఇతర ఉద్యోగ అవకాశాల కోసం విద్యార్థులను ఆయా పరిశ్రమలకు పంపించి వారి మేధస్సుకు పదును పెడుతున్నారు. టాటా ప్రాజెక్ట్స్ ఫిట్టర్ కోర్సులో, హ్యుందాయ్ మోటార్స్ మెకానికల్ మోటార్ వెహికల్, టొయోటా కిర్లోస్కర్ వెల్డర్, పెయింటర్ కోర్సుల్లో ఎంఓయూ కుదుర్చుకుని శిక్షణకు కావాల్సిన ఉత్పత్తులను సమకూరుస్తున్నాయి.

చదివే దశలోనే ఉపాధి పొందాలన్నదే ఉద్దేశం

ఐటీఐలో చదివే ప్రతి విద్యార్థి చదువుకుంటుండగానే ఉపాధి అవకాశాలను పొందాలన్నదే తమ ఉద్దేశం. ఇందుకు మల్టీనేషనల్ కంపెనీలు సైతం ముందుకొచ్చి కోర్సుకు సంబంధించిన పరికరాలను సమకూర్చడం, శిక్షణకు సహకారం అందించడం ద్వారా ఉపాధి అవకాశాలను మరింతగా మెరుగుపరుస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వ ఉపాధి కల్పన శాఖ ముఖ్య ఉద్దేశం కూడా ఇలాంటి కంపెనీలతో ఒప్పందం అయ్యి ఉపాధి అవకాశాలను పెంచడమే, ఆ దిశగా సనత్‌నగర్ ఐటీఐ కృషి చేస్తోంది.

–బుసిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పవర్‌గ్రిడ్ స్వచ్ఛత పఖ్వాడా

పద్మారావునగర్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మంగళవారం పవర్‌గ్రిడ్ దక్షిణ ప్రాంతం సిబ్బంది స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాలతో పాటు ఏరియాలను ఏ విధంగా శుభ్రంగా ఉంచుకోవాలనే విషయంపై ప్లాట్ ఫాం-1 పైన నాటకాన్ని ప్రదర్శించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన స్వచ్ఛత ర్యాలీ, పరిశుభ్రత డ్రైవ్‌లో పవర్‌గ్రిడ్ సదరన్ రీజియన్-1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజేష్ శ్రీవాస్తవ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మేనేజర్ రాజనర్సు, పవర్‌గ్రిడ్ చీఫ్ జనరల్ మేనేజర్(హెచ్‌ఆర్) పీకే హరినారాయణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తా వేయెద్దన్నారు. పరిశుభ్రతపై విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించారు.



తహసీల్దార్ కార్యాలయంలో వద్ద మొండిబండ నగర్ వాసులు

కనీస వసతులు కల్పించాలి

అడ్డగుట్ట: మొండిబండనగర్‌లో నివాసముంటున్న వారికి కనీస వసతులు కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అడ్డగుట్ట ఫౌండర్స్ అండ్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మారేడుపల్లి తహసీల్దార్ మాధవిరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొండిబండ నగర్‌లో సుమారు నలభై ఏళ్లుగా జీవనం సాగిస్తున్న నిర్వాసితులకు కనీస వసతులు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కేవలం ఎన్నికల సమయాల్లో నాయకులు వచ్చి హామీలు ఇచ్చి వెళ్తుంటారని, ఆ తరువాత బస్తీవైపు కన్నెత్తి చూడరని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ కనెక్షన్, తాగునీటి సౌకర్యం కల్పించి జీవో 58 కింద మొండిబండ నగర్ వాసులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు. వినతి ఇచ్చిన వారిలో రమాదేవి, కోటేశ్వర్ రావు, వీరమ్మ, ఏసమ్మ, సూజాత, శివయ్య, రాజు, యాదగిరి ఉన్నారు.

ఇంటి తాళం పగులగొట్టి చోరీ

అమీర్‌పేట: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన ఎస్‌ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. ఈఎస్‌ఐ సమీపంలోని వికాస్‌పురి కాలనీలో వైద్యురాలు డి.కె.అహల్య ఉంటున్నారు. ఈ నెల 25వ తేదీన కుటుంబంతో కలిసి అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్లి 29న ఇంటికి రాగా తాళం పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా బీరువాలో దాచిన 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రసూల్‌పురా: గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పాతబోయిన్‌పల్లి ఆర్‌ఆర్‌నగర్ వద్ద ఓ వ్యక్తి (45) అపస్మారక స్థితిలో రోడ్డు పక్కన ఉన్నట్లు గుర్తించిన కానిస్టేబుళ్లు డయల్ 100 ద్వారా సహకారంతో గాంధీకి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

మాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లింగాస్వామి



ఉస్మానియా యూనివర్సిటీ: మాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ మంచాల లింగస్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం లక్డీకాపూల్‌లో వివిధ మాల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో జేఏసీ చైర్మన్ చెన్నయ్య తన పేరును ప్రకటించినట్లు తెలిపారు. ఓయూలో మాల విద్యార్థి సంఘాన్ని స్థాపించి తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన లింగస్వామి పీహెచ్‌డీ పూర్తి చేసి పార్ట్‌టైం అధ్యాపకులుగా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలల హక్కులు, ఆత్మగౌరవం కోసం పోరాడుతానన్నారు.

మహిళ అదృశ్యం



నిధి

లాలాపేట: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్ వివరాల ప్రకారం.. తార్నాకలోని ఆర్‌డీఎస్ స్వధార్ గృహ్ ఆశ్రమానికి చెందిన నిధి(30) అనే మహిళ ఈ నెల 19న ఆశ్రమం నుంచి తప్పించుకుని పోయింది. పలు ప్రాంతాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో నిర్వాహకులు టీఎల్ వరలక్ష్మీ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆచూకి తెలిసిన వారు 871 2661263 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. చర్లపల్లి రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో ఓ వ్యక్తి (40) పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

ప్లాట్‌ఫాం బ్రిడ్జిపై..

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని 4/5 ప్లాట్‌ఫామ్ మీదగల న్యూ బ్రిడ్జి కింద ఓ వ్యక్తి మరణించి ఉన్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాజకిషన్ జైస్వాల్‌గా పోలీసులు గుర్తించారు.

ట్యాంక్‌బండ్‌పై గుర్తు తెలియని మృతదేహం



బన్సీలాల్‌పేట్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన గాంధీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ట్యాంక్‌బండ్‌పై సుమారు 35 సంవత్సరాల వయస్సుగల ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాల కోసం ఆరా తీస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మోహన్‌రావు తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ విషయంలో గొడవ

అడ్డగుట్ట: క్రికెట్ బెట్టింగ్‌లో డబ్బుల తారుమారు విషయంలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణకు దారి తీసిన ఘటన తుకారాంగేట్ పరిధిలో చోటు చేసుకుంది. గుజరాత్-చెన్నై మధ్య జరిగిన ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌పై అడ్డగుట్టకు చెందిన రెండు గ్రూపుల మధ్య బెట్టింగ్ నడిచింది. డబ్బుల విషయంలో తారుమారు చేశారంటూ ఓ యువకుడిపై కొందరు దాడి చేశారు. గాయపడ్డ యువకుడు తోటి స్నేహితులకు సమాచారం ఇవ్వడంతో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో పది మంది వచ్చి పరస్పర దాడులకు దిగారు.దాదాపుగా రెండు గంటల పాటు వీరంతా వీరంగం సృష్టించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తలకు గాయమైన యువకుడిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పార్టీ గెలుపు కోసం ఐక్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న అనీల్‌కుమార్ యాదవ్

రసూల్‌పురా: ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం పార్టీ నాయకులందరూ ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనీల్‌కుమార్ యాదవ్ సూచించారు. మంగళవారం బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో ప్యారసాని రామ్‌కుమార్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ ముఖ్య నాయకుల కార్యకర్తల సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అనీల్ మాట్లాడారు. కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని కానీ.. నాయకులు తలోదారి అన్నట్లు వ్యవహరిస్తున్నారని అలా కాకుండా అందరు ఐక్యతగా ఉండి వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్ట పడిన వారికే తగిన గుర్తింపు ఉంటుందన్నారు.

- జూన్ 2న కంటోన్మెంట్ నియోజకవర్గంలో అన్ని వార్డుల్లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని అనీల్‌కుమార్ కోరారు. బైక్‌ర్యాలీలు, జెండాలు ఎగురవేయాలని సూచించారు. టీపీసీసీ కార్యదర్శి అయూబ్‌ఖాన్ మాట్లాడుతూ.. సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిన విషయం మరచిపోయి రాష్ట్ర మంత్రులు తామేదో సాధించినట్లు కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బొల్లు కిషన్, దేవేందర్, జహీర్ లలాని, జమీల్, వినోద్ మురళి, ఆవుల బాల్‌రాజ్ యాదవ్, వరద రాణి, నరసింహ కన్నన్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవాలి..

సికింద్రాబాద్: కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తేవడంతో పాటు పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎం.అనీల్‌కుమార్‌యాదవ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ అధ్యక్షుడిగా నియమితులైన అనిల్‌కుమార్ యాదవ్‌ను మంగళవారం బీఎస్‌ఆర్ గార్డెన్‌లో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక ఎన్నికల ఫలితాలు తెలంగాణ రాష్ట్రంలో పునరావృతం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో సంతోష్‌కుమార్, జగదీశ్వర్, కృష్ణ మోహన్‌గౌడ్, సురేశ్‌లాల్, శ్రీనివాస్, సందీప్‌రాజ్, అనిల్‌కుమార్, వహీదుద్దీన్, దీపక్‌జాన్ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల పనుల జాప్యంపై అసంతృప్తి



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పద్మారావు గౌడ్

లాలాపేట: సాయినగర్‌లో కొనసాగుతున్న 'డబుల్' ఇళ్ల నిర్మాణ పనులపై డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి పనుల జాప్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. . వీలైనంత తొందరగా నిర్మాణం పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో పాటుగా లాలాపేటలోని ప్రొ. జయశంకర్ స్టేడియం ఆవరణలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులు, జీహెచ్ఎంసీ ప్లే గ్రౌండ్‌లో చేపట్టిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ తదితర నిర్మాణ పనులను పనులను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట కృష్ణవేణి స్టాలిన్, పర్శరామ్, నర్సింగరావు, తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



అధికారులకు సమస్యలు వివరిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

రసూల్‌పురా: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే దిశగా సత్వరమే అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్, కంటోన్మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి సూచించారు. మంగళవారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని మోండా డివిజన్ అంబేడ్కర్ నగర్, జయప్రకాష్ నగర్, బోర్డు ఆరవ వార్డు పరిధిలోని ప్రోగ్రెసివ్ కాలనీల్లో కంటోన్మెంట్ బోర్డు, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యటించి స్థానికుల సమస్యలను వారికి వివరించి పరిష్కరించాలని కోరారు. ఆరవ వార్డులో స్థానిక నేతలతో సమన్వయం చేసుకుంటూ రానున్న వర్షకాలంలో ముంపు సమస్య పునరావృతం కాకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మోండా డివిజన్ అంబేడ్కర్‌నగర్, జయప్రకాష్ నగర్‌లో డ్రైనేజీ, ఓపెన్ నాలా, విద్యుత్ సరఫరా సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండు యాదవ్, ముప్పిడి మధుకర్, సుధాకర్, ఆంజనేయులు, పూర్ణచందర్, రాజుసింగ్, సురేష్, సోమయ్య, నర్సారెడ్డి, రాజయ్య పాల్గొన్నారు.

రెజిమెంటల్‌బజార్‌లో కార్పొరేటర్ పర్యటన



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

రాంగోపాల్‌పేట్: రెజిమెంటల్‌బజార్‌లో మంగళవారం జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కార్పొరేటర్ కొంతం దీపిక పర్యటించారు. అంతర్గత రహదారుల్లో నిత్యం మురుగు నీరు పొంగిపొర్లుతూ స్థానికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్న విషయం తెలిసిందే. దీంతో కార్పొరేటర్ కొంతం దీపిక అధికారులపై ఒత్తిడి చేయడంతో జీహెచ్ఎంసీ సీజీఎం ప్రభు, డీజీఎం కృష్ణ, మేనేజర్ హాకీం, జీహెచ్ఎంసీ ఏఈ రవీందర్ తదితరులు డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో పరిశీలించారు. సలూజా నర్సింగ్ హోం వెనుక వైపు పొంగుతున్న డ్రైనేజీ సమస్య గురించి చర్చించారు. అలాగే గురుద్వారా వెనుక వైపు వరద నీటి పైప్‌లైన్‌లో పూడిక నిండిపోయి తరచుగా పొంగుతుండటాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతంలో వరద నీటి పైప్‌లైన్, మ్యాన్‌హోళ్లు షిల్టుతో నిండి ఉన్నాయని ఇతర ప్రాంతాల నుంచి సిబ్బందిని రప్పించి వెంటనే షిల్టు తొలగిస్తామని అధికారులు చెప్పారు. గురుద్వారా నుంచి 31 బస్టాప్ వైపు పైప్‌లైన్ లింకు కలుపకపోవడంతో వస్తున్న సమస్యను గుర్తించి ఈ పనులు పూర్తి చేయిస్తామని అధికారులు తెలిపారు. మసీదు గల్లీలో కూడా తరచుగా మురుగు నీరు పొంగుతుండడాన్ని కార్పొరేటర్ అధికారుల దృష్టికి తేగా ఇక్కడ పైప్‌లైన్ పగిలిపోయి బ్లాక్ అయిందని వెంటనే పైప్‌లైన్ మారుస్తామని జలమండలి అధికారులు తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు



మెమెంటోలను అందిస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: విద్య ద్వారానే సమాజంలో గౌరవం, మర్యాదతో పాటు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఉస్మానియా యూనివర్సిటీ కామర్స్ విభాగపు అధిపతి ప్రొఫెసర్ చిన్నప్ప అన్నారు. మంగళవారం నిర్వహించిన సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ డిగ్రీ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించే తమ ప్రతిభ పాటవాలతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న వారు ఎందరో ఉన్నారన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, అంకితభావంతో తాము అనుకున్న లక్ష్యాలను ఛేదించాలని సూచించారు. చదువుకునే సమయంలో విద్యను నిర్లక్ష్యం చేస్తే జీవితాంతం బాధపడాల్సి వస్తుందని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలను ఉన్నత స్థానంలో చూడాలని ఆశిస్తుంటారని వారి ఆశయాలను వమ్ము చేయరాదన్నారు. హైదరాబాద్ ఆర్చ్ డయాసిస్ ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ వై బాలశౌరి, సెయింట్ మేరీస్ ఫార్మసీ కాలేజ్ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఏరువ బాల, ప్రిన్సిపాల్ రెవరెండ్ ఆంథోని వినయ్ మాట్లాడారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అధికారులను ఆదేశించారు. గాంధీనగర్ డివిజన్‌లోని బాపునగర్, అరుంధతీనగర్, సబర్మతీనగర్, వాల్మీకినగర్‌లో రూ. 10 లక్షలతో నిర్మించనున్న ఎస్ఎస్ ఫ్లోరింగ్ పనులు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌తో కలిసి బాపునగర్ రాజరాజేశ్వరి ఆలయం వద్ద మంగళవారం ప్రారంభించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. 40 ఏళ్ల వరకు ఇబ్బందులు రాకుండా నాణ్యతతో పనులు చేపట్టాలన్నారు. జీహెచ్ఎంసీ డీఈ గీత, ఏఈ అబ్దుల్ సలామ్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు వినయ్, సాయిచంద్, ఉమేష్, ఆనంద్, దామోదర్, జైసింహ, రాకేష్, ప్రభాకర్, నరేశ్ జగదీష్‌లు పాల్గొన్నారు.